క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆదేశాలిస్తున్న కమిషనర్ వేణుమాధవ్

సుల్తానాబాద్: పట్టణ ప్రజలు వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ సూచించారు. పట్టణంలోని సుగ్లాంపల్లిలో పూడికపోయిన డ్రైనేజీలను జేసీబీ సహకారంతో తొలగించాలని మంగళవారం ప్రత్యేక అధికారులు సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభ దశలో ఉన్నందున తప్పనిసరిగా ప్రతి కాలనీలో డ్రైనేజీలను శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ వేయాలని, పూడుకుపోయిన డ్రైనేజీలను వెంటనే శుభ్రం చేయించాలని సూచించారు. మేనేజర్ అలీమొద్దీన్, సిబ్బంది ఉన్నారు.

ఓదెల ఆర్ఐలు బదిలీ

ఓదెల: ఓదెల తహసీల్ కార్యాలయంలో పనిచేస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నర్సింగ్, రాజేందర్ మంగళవారం బదిలీ అయినట్లు అధికారులు తెలిపారు. నర్సింగ్ పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయానికి రాజేందర్ కాల్వశ్రీరాంపూర్‌కు బదిలీ అయ్యారు. ఓదెలకు ముత్తారం నుంచి రమేశ్, అంతర్గాం నుంచి మహేశ్ రానున్నట్లు సమాచారం.

'మిషనరీ స్కూల్ ముసుగులో దోపిడీ'

గోదావరిఖనిటౌన్: క్రిస్టియన్ మిషనరీ స్కూల్ ముసుగులో స్థానిక ఓ పాఠశాల అధిక ఫీజులతో దోపిడీకి పాల్పడుతోందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు యాసర్ల రాజ్‌కుమార్ ఆరోపించారు. పాఠశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా ప్రతి విద్యా సంవత్సరం ఫీజులను 20 నుంచి 40శాతం పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థిక దోపిడీకి గురిచేస్తున్నారన్నారు. పేద విద్యార్థులకు ఫీజులో 25శాతం రాయితీ ఇవ్వాలనే ప్రభుత్వ నిబంధనను పాటించడం లేదని విమర్శించారు. కార్పొరేట్ స్థాయిలో ఫీజులు వసూలు చేసి అక్రమాలకు పాల్పడుతున్న సదరు పాఠశాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న భగీరథ సర్వే

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో మిషన్ భగీరథ సర్వే కొనసాగుతోంది. పెద్దాపూర్‌లో మంగళవారం ఏపీవో సదానందం సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సర్వేలో పంచాయతీ కార్యదర్శులు పున్నమయ్య, అంజలీధర్, లచ్చయ్య, సంధ్య, అంగన్వాడీ కార్యకర్తలు సత్యవ్రత, అలేఖ్య, రాజనర్సమ్మ పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువుల ధరలు నియంత్రించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ఎరువులు, విత్తన డీలర్లు అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం పెద్దపల్లి ఏరియా కార్యదర్శి సీపెల్లి రవీందర్ కోరారు. కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ తదితర ప్రాంతాల్లో ఎరువు, విత్తనాలను ఎక్కువ ధరలకు అమ్ముతున్నారని ఆరోపించారు. డిమాండ్ ఉన్న విత్తన, ఎరువులను బ్లాక్‌మార్కెట్‌లో అమ్ముతున్నారన్నారు. విత్తన దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కోరారు. నాయకులు కల్లెపల్లి అశోక్, ప్రశాంత్, రాంచరణ్, నవీన్ ఉన్నారు.

మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దు



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ముత్తారం: మత్తు పదార్థాలకు అలవాటు పడి యువత చెడిపోవద్దని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం గురువారం ముత్తారంలో ఆటపాటలతో ప్రదర్శన చేశారు. ప్రయివేట్ బడి కన్నా ప్రభుత్వ పాఠశాల ముద్దు అని ప్రదర్శన చేశారు. బడి ఈడు పిల్లలను సర్కారు బడులకు పంపించాలని కళాకారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు కొండ్ర వెంకన్నగౌడ్, ఇల్లందుల మల్లేశ్, బుర్ర శంకర్‌గౌడ్, సలేంద్ర రాజన్న, జిన్న రమ, కన్నూరి రేణుక, కట్కూరి శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

'నులి'పేద్దాం రండి

- జిల్లాలో బోదకాలు, నులిపురుగుల నిర్మూలనకు కార్యాచరణ
- 20 నుంచి 23వ తేదీ వరకు ఉచితంగా మాత్రల పంపిణీ



సుల్తానాబాద్‌లో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లతో మాట్లాడుతున్న డాక్టర్

సుల్తానాబాద్: బోధకాలు, నులిపురుగులు నిర్మూలనకు మాత్రలు పంపిణీ చేసేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. జిల్లాలో ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించేందుకు రూపొందించింది. ఇంటింటికీ తిరిగి 27న ఉచితంగా మాత్రలను ఆరోగ్య సిబ్బంది అందజేయనున్నారు. జాతీయ బోధకాలు నియంత్రణ దినోత్సవం సందర్భంగా బోధకాల వ్యాధి, నులిపురుగుల నిర్మూలనకు సామూహికంగా డీఈసీ, ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 2,27,251 మంది అర్హులుగా గుర్తించారు. జిల్లాలో ఆల్బెండజోల్ మాత్రలు 2,41,450 ఉన్నాయి. వీరందరికీ మాత్రలు వేసేందుకు 706 మంది బృందాలను ఎంపిక చేశారు. ఒక్కో బృందంలో ఒక ఆశా కార్యకర్త, ఒక అంగన్‌వాడీ టీచర్ ఉంటారు. వీరు ఇంటింటికీ తిరిగి అర్హులకు మాత్రలు వేయించాల్సి ఉంది. ఇప్పటికే వీరితో వైద్యాధికారులు సమావేశమై తగు సూచనలు ఇచ్చారు.

పంపిణీ తీరు..

- బోధకాలు వ్యాధి దోమల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. కాలు, చెయ్యి, రొమ్ము, పురుష, స్త్రీ జననాంగాల్లో వాపు ఉంటుంది. ఈ వ్యాధి రాకుండా ఉండేందుకు డీఈసీ మాత్రలు వేసుకోవాలి.
- రెండు నుంచి ఐదేళ్ల వయసు వారికి 100ఎంజీ ఒక మాత్ర,
- ఆరు నుంచి 14ఏళ్ల వయసు వారికి 100ఎంజీ రెండు మాత్రలు,
- 15 ఏళ్ల పైబడిన వారికి 100 ఎంజీ మూడు మాత్రలు వేయనున్నారు.
- నులిపురుగుల నిర్మూలనకు రెండేళ్ల పైబడిన వారందరికీ ఆల్బెండజోలు మాత్రలు పంపిణీ చేస్తారు.

ఏర్పాట్లు చేశాం



జిల్లా బోధకాలు, నులిపురుగుల నిర్మూలనకు మాత్రలు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఇంటింటికీ వెళ్లి అర్హులకు డీఈసీ, ఆల్బెండజోల్ మాత్రలను ఆరోగ్య సిబ్బంది అందజేస్తారు. భోజనం తిన్న తర్వాతనే వీటిని మింగాలి. అపోహలు లేకుండా అర్హులందరూ మాత్రలు వేసుకోవాలి. రెండేళ్లలోపు పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారు, గర్భిణులు వేసుకోవద్దు.
– ప్రమోద్‌కుమార్, జిల్లా వైద్యాధికారి, పెద్దపల్లి

జిల్లాలో ఇలా..

జిల్లాలో 2,27,251 మంది అర్హులను గుర్తించారు. 2,49, 976 మాత్రలు అందుబాటులో ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఉన్నతాధికారులు మాత్రలను వేసే వరకు పాఠశాలల్లో అక్కడే ఉండి వేసేలా చొరవ తీసుకోవాలని ఆదేశించారు. వీటిని సూపర్‌వైజర్లుగా ఏఎన్ఎంలు ప్రతి గ్రామంలో ఉండేలా ఉన్నతాధికారులు చొరవ తీసుకున్నట్లు జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ తెలిపారు. గ్రామాల్లో, పట్టణాల్లో 20 నుంచి 23వ తేదీ వరకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు.

ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి



పరిశీలిస్తున్న ఆర్డీవో హనుమానాయక్

రామగిరి: ప్రజల నుంచి వచ్చే ధరణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని, కార్యాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా ఉండాలని మంథని ఆర్డీవో హనుమా నాయక్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. రామగిరి తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన ధరణి రికార్డులను పరిశీలించారు. ధరణి పోర్టల్‌లో ఎన్ని సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధరణి సమస్యలపై వచ్చే ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని, పరిష్కారానికి సలహాలు, సూచనలు అందించాలని సిబ్బందికి సూచించారు. దరఖాస్తుల విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంచందర్‌రావు, ఆర్ఐ నిహారిక, జూనియర్ సహాయకులు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రైవింగ్ నైపుణ్య పరీక్షలు పారదర్శకంగా నిర్వహిస్తాం



జెండా ఊపి ప్రారంభిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి: సింగరేణి సంస్థ అంతర్గత అభ్యర్థుల కోసం నిర్వహించే డ్రైవింగ్ నైపుణ్యం ప్రాక్టికల్ పరీక్షలు పారదర్శకంగా నిర్వహిస్తామని ఆర్జీ–3 జీఎం ఎన్.సుధాకర్‌రావు అన్నారు. మంగళవారం సెంటనరీకాలనీ రాణిరుద్రమ దేవి క్రీడా ప్రాంగణంలో ఆర్జీ–2, 3, ఏపీఏ ఏరియాల అభ్యర్థులకు ఈపీ ఆపరేటర్ ట్రైనీ (కేటగిరీ–5) ఉద్యోగ నియామకాలకు సంబంధించిన డ్రైవింగ్ నైపుణ్యం పరీక్షలను ఆయన ప్రారంభించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 20 వరకు ప్రాక్టికల్ పరీక్షలు పారదర్శకంగా జరుగుతాయని, అభ్యర్థులు నిర్ణీత సమయానికి హాజరై తమ ప్రతిభను కనబర్చి అర్హత సాధించాలని ఆకాంక్షించారు. ఈ పరీక్షల్లో అర్హత సాధించిన వారు ఈ నెల 30న నిర్వహించే రాత పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుదన్నారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్, ఎస్ఓటూ జీఎం జి.రఘుపతి, కార్పొరేట్ పర్సనల్ డీజీఎం విలాస్ పోద్దార్, అధికారులు ఆర్.శ్రీనివాస్, కె.చంద్రశేఖర్, ముప్పిడి రవీందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మారుతి, గుర్రం శ్రీహరి, సునీల్ ప్రసాద్ పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మనాలీ రాజ్‌ఠాగూర్, నాయకులు

గోదావరిఖని: చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడి అతి కిరాతకంగా చంపిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని మహిళా కాంగ్రెస్ నాయకురాలు మనాలీరాజ్‌ఠాగూర్ డిమాండ్ చేశారు. రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాగూర్ ఆదేశాల మేరకు స్థానిక ప్రధాన చౌరస్తాలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. చిన్నారి ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. చిన్నారి కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, మహిళలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



అంబేద్కర్ కూడలిలో న్యూడెమోక్రసీ నిరసన

రామగుండం: ఇటీవల కాట్నపల్లిలో చిన్నారిపై జరిగిన అత్యాచార ఘటనపై మంగళవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఈదునూరి రామకృష్ణ మాట్లాడుతూ చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీరియస్‌గా వ్యవహరించి బాధిత కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈసంపెల్లి రాజేందర్, దేవయ్య, పుల్లూరి నాగభూషణం, సంబోజి ప్రసాద్, మహిపాల్, మనోజ్, రాజు, అవినాష్ ఉన్నారు.

మురుగు తొలగింపు



వ్యర్థాలను తొలగిస్తున్న శానిటేషన్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ప్రగతినగర్‌లో డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో ఎక్కడ చూసినా మురికి నీరు దర్శనమిస్తోంది. దీనిపై మంగళవారం సాక్షి దినపత్రికలో 'ఎటు చూసినా మురుగు' అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన కార్పొరేషన్ శానిటరీ విభాగం అధికారులు కాలనీలోని మురుగునీటితో పేరుకుపోయిన కాలువలను శుభ్రం చేశారు. శానిటరీ సూపర్‌వైజర్ ఆడెపు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఏఐటీయూసీ



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికులకు అండగా ఏఐటీయూసీ ఉంటుందని సంఘం కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు ఎల్.ప్రకాశ్, ఆర్జీ–2 బ్రాంచ్ కార్యదర్శి జీగురు రవీందర్ అన్నారు. ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లి గని కార్మికులతో మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఆర్జీ–2 ఏరియాలో ఖాళీగా ఉన్న 236 సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ప్రమోషన్లకు గాను గత ఫిబ్రవరిలో 100మందికి ఇప్పించామన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మూడు నెలల తర్వాత సోమవారం సింగరేణి యజమాన్యంతో మాట్లాడి సీనియారిటీ, మెరిట్ ప్రకారం పారదర్శకంగా 113 మంది కార్మికులకు సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌గా ప్రమోషన్లు ఇప్పించినట్లు పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ముందుంటుందని, సింగరేణి యువ కార్మికులు యూనియన్‌కు సహకరించాలని కోరారు. సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌గా ప్రమోషన్లు పొందిన కార్మికులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు అన్నారావు, మహేందర్, సంపత్, విజయ్, అశోక్, నాగరాజు, కిషన్, శ్రీనివాస్, మధు, శ్రీకాంత్ పాల్గొన్నారు.



ప్రమాదకరంగా గుంత

కమాన్‌పూర్: మండల కేంద్రంలో శ్రీపాద విగ్రహం సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న గుంత ప్రమాదకరంగా మారింది. కొన్ని నెలల క్రితం రహదారిని తవ్వి తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేశారు. దీంతో రహదారిపై మట్టి కుంగుతుండడంతో భారీ గుంత ఏర్పడింది. దారి వెంట వెళ్లే వాహనదారులు గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతను పూడ్చివేయాలని వాహనదారులు కోరుతున్నారు.

వసతి గృహాల సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న సిబ్బంది

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని మోడల్ హాస్టళ్లలో పనిచేస్తున్న కేర్‌టేకర్, ఏఎన్ఎం, హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్, వాచ్‌మెన్ తదితర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి సునీల్ మాట్లాడారు. మోడల్ వసతి గృహాల్లో పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పనిగంటలు తగ్గించాలని, కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలివ్వాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో తిరుమల, ధనలక్ష్మి, గీత, మహిత, దేవమ్మ, రజిత, భారతి, వసంతలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

గోదావరిఖని: స్థానిక ఫైర్‌స్టేషన్ సమీపంలోని ప్రభుత్వ భూమిని కబ్జాదారుల చెర నుంచి కాపాడాలని కార్పొరేటర్ గాదెం విజయ కోరారు. కలెక్టర్‌కు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్థానిక 25వ డివిజన్ మార్కండేయకాలనీలోని ఫైర్‌స్టేషన్ పక్కన గల 18గుంటల భూమిని కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో అక్కడ గుడిసెలు వేసుకుని నివాసముంటున్న వారికి సాయం చేస్తామనే పేరుతో మరుగుదొడ్లు నిర్మించారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ హయాంలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. కొందరు ఈ భూమిని గుంటకు రూ.25లక్షల నుంచి రూ.30లక్షల చొప్పున విక్రయించేందుకు చూస్తున్నారన్నారు. కబ్జాదారుల నుంచి ఈ భూమిని కాపాడాలని కోరారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

రామగిరి: మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ముల్మూరి శ్రీనివాస్ కోరారు. బీజేపీ ఆధ్వర్యంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని మంగళవారం తహసీల్దార్ రాంచందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆధార్ అప్‌డేట్ కోసం పిల్లలు, వృద్ధులు, మహిళలు దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. మండల జనాబా దృష్ట్యా మరో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని, అప్పటివరకు ప్రస్తుతం ఉన్న ఆధార్ సెంటర్‌ను మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆధార్ సెంటర్ ఒక గ్రామంలో ఏర్పాటు చేయడం సరికాదని, గతంలో మాదిరిగానే తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసి మండల ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో గల మీసేవా కేంద్రాల నిర్వాహకులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే మీసేవా కేంద్రాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. సెంటనరీకాలనీ పట్టణ అధ్యక్షుడు తీగల శ్రీధర్, నాయకులు మెరుగు శ్రీకాంత్, కందుల రమేశ్ పాల్గొన్నారు.

అధికారులు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం సరికాదు



మాట్లాడుతున్న మాజీ ఎంపీటీసీ నాగరాజు

రామగిరి: మండలంలోని పేద్దంపేట పంచాయతీ పరిధిలోని భూనిర్వాసిత గ్రామమైన మంగళపల్లి గ్రామస్తులకు రెవెన్యూ అధికారులు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం సరికాదని, వెంటనే సర్టిఫికెట్లు ఇవ్వాలని మాజీ ఎంపీటీసీ సుందిళ్ల నాగరాజు అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళపల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులు అక్కడ నివాసం ఉండటం లేదన్న సాకుతో రెవెన్యూ అధికారులు కులం, ఆదాయం, నివాసం, గ్యాప్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. తమకు సింగరేణి నుంచి రావాల్సిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పూర్తిగా రాలేదన్నారు. గ్రామానికి చెందిన విద్యార్థులు పై చదువుల కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వివిధ సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేవారు. లేని పక్షంలో గ్రామస్తులంతా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ఉపసర్పంచ్ బొడ్డు మల్లయ్య, గ్రామస్తులు పూరెళ్ల శ్రీనివాస్, పల్లెర్ల నరేశ్, రామగిరి రాయమల్లు పాల్గొన్నారు.

చిన్నారికి జాతీయ మానవ హక్కుల కమిటీ నివాళి

సుల్తానాబాద్: పట్టణంలో జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా కమిటీ అధ్యక్షుడు పూసాల కృష్ణ, సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు మహమ్మద్ యూసుఫ్ ఆధ్వర్యంలో చిన్నారికి నివాళి అర్పించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో మంగళవారం నివాళి అర్పించారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య మాట్లాడుతూ చిన్నారిపై జరిగిన అమానవీయ సంఘటనను ఖండిస్తూ పసిపిల్లలను అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. మంత్రులు హామీ ఇచ్చిన విధంగా చిన్నారి కుటుంబంలో వెంటనే ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాజయ్య, జోనల్ కమిటీ కోకన్వీనర్ ఇంజం సాంబశివరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బూర్ల వంశీ, పలు మండల అధ్యక్షులు యూసుఫ్, హరిబాబు, జనరల్ సెక్రటరీ బొడ్డుపల్లి కనకయ్య, తిరుపతి, శ్రీనివాస్, రమేశ్, కల్లిపెల్లి కుమార్, అడపా బాపురెడ్డి, సమీర్, బొజ్జ క్రాంతి, రమేశ్, శ్రీదేవి, రాజు, ప్రచార కార్యదర్శి కొత్త కమలాకర్, జాయింట్ సెక్రటరీ బొడ్డుపల్లి సదయ్య పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్ విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో వివిధ సెక్షన్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చలో కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ, ప్రధాన కార్యదర్శి బి.అశోక్ పిలుపునిచ్చారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీలో మంగళవారం కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి ధర్నాకు సంబంధించిన కర పత్రాలను ఆవిష్కరించారు. కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలు వారి డిమాండ్లు, వేతనాల పెంపుదల, జీవోల అమలు కోసం 24న చేపట్టనున్న చలో ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పద్మ, బుచ్చమ్మ, శారద, శంకర్, లింగయ్య, దుర్గం బాబు, రమేశ్, దుర్గేష్, లత, శంకరమ్మ, సదానందం, రజిత పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై సందీప్, సుకుమార్

రామగిరి: మండలంలోని సెంటనరీకాలనీకి చెందిన రామకృష్ణ సెల్‌ఫోన్ పోగొట్టుకోగా మంగళవారం ఎస్సై కె.సందీప్‌కుమార్ అప్పగించారు. సెంటనరీకాలనీ తెలంగాణ చౌరస్తాలో రామకృష్ణ ఫోన్ పోగొట్టుకొగా బేగంపేట గ్రామానికి చెందిన కొండ్ర సుకుమార్‌కు దొరికింది. సెల్‌ఫోన్‌ను ఎస్సైకి అప్పగించారు. ఎస్సై ఫోన్‌ను పరిశీలించి రామకృష్ణదేనని నిర్ధారించి సుకుమార్‌తో కలిసి అందజేశారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీపీ

రామగిరి: జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కోయ శ్రీహర్షను మంగళవారం ఎంపీపీ ఆరెల్లి దేవక్క మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందించి శాలువా కప్పి సన్మానించారు. మంథని డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్, నాయకులు మార్కొండ సంతోష్ ఉన్నారు.

ఇంటింటా భగీరథ సర్వే పూర్తి చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని 16 గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న ఇంటింటా మిషన్ భగీరథ ఆన్‌లైన్ సర్వే ప్రక్రియను సత్వరమే పూర్తి చేసి బుధవారం నివేదికలు సమర్పించాలని ఎంపీడీవో ఎంఏ.అలీం ఆదేశించారు. పలు గ్రామాల్లో మంగళవారం క్షేత్రస్థాయి పర్యటించారు. బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయతీని ఆకస్మికంగా సందర్శించి ఉపాధిహామీ పథకానికి సంబంధించిన రిజిష్టర్లను పరిశీలించారు. పలు అంశాలపై కార్యదర్శి గీతావాణిని ప్రశ్నించారు. అనంతరం పలు గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. హరితహారం కార్యక్రమానికి మొక్కలను సిద్ధం చేయాలని నిర్వాహకులకు సూచించారు.